

మళ్లీ కలప దందా

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, సిరికొండ కేంద్రాలుగా మళ్లీ కలప దందా మరువైంది. దట్టమైన అటవీప్రాంతంలోని టేకుచెట్లను నరికి తరలిస్తున్నారు. 8లో▸



పచ్చబంగారానికి తెగుళ్లు

పసుపును దుంపకుళ్లు తెగులు వదలడం లేదు. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న పసుపు రైతులు తెగుళ్లతో మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 / 13.3

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. పగలు కూడా చల్లగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. వేకువ జామున మంచు కురుస్తుంది.

డేంజర్.. మాంజా

- జిల్లాలో యథేచ్ఛగా చైనా మాంజా అమ్మకాలు
- నిషేధం ఉన్నా పట్టించుకోని వ్యాపారులు
- ఖానాపూర్‌లో చైనా మాంజా తాకి ఇద్దరికి గాయాలు
- ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు



సారంగాపూర్‌లో పతంగుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



భైంసాలో తనిఖీలు చేస్తున్న సీఐ గోపీనాథ్

నిర్మల్‌టౌన్: సంక్రాంతి అంటే పతంగులే గుర్తుకు వస్తాయి. ఈ పండగకు వారం ముందు నుంచే చిన్నా, పెద్ద అంతా గాలిపటాలు ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతారు. గతంలో పతంగులను ఎగరేసేందుకు కాటన్ మాంజా వాడేవారు. పోటీ పెరగడంతో మాంజా దారానికి గాజు పిండి, సాబుదానా(సగ్గుబియ్యం), గంధకం, రంగులు వేసి మాంజాను తయారు చేసేవారు. ప్రస్తుతం మార్కెట్లో ప్రమాదకరమైన చైనా మాంజా రాజ్యమేలుతోంది. రసాయనాలు పూసిన ఈ మాంజాతో పక్షులు, మనుషులకు కూడా ముప్పు వాటిల్లుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 2017, జూలై 11న చైనా మాంజాపై నిషేధం విధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమే. చైనా మాంజా అమ్మితే ఏడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తారు. రెండేళ్ల క్రితం నిషేధ చట్టం చేసినా ఇప్పటికీ మార్కెట్లో చైనా మాంజా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

విచ్చలవిడిగా అమ్మకాలు..

జిల్లాలో చైనా మాంజా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ కాటన్ మాంజా ధరతో పోల్చుకుంటే చైనా మాంజా ధర తక్కువగా ఉంది. దీంతో చాలా మంది చైనా మాంజా కొనుగోలు చేస్తున్నారు. ఇక చైనా మాంజా విక్రయించే వ్యాపారులకు లాభం కూడా ఎక్కువ. ఇంపైన రంగుల్లో మాంజా లభిస్తోంది. గాలి పటాలకు కట్టి.. ఇతరుల గాలిపటాలను కోసేందుకు చైనా మాంజా వాడుతున్నారు.

హెచ్చరికలు బేఖాతరు..

గతంలో చైనా మాంజా పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి దిగుమతి అయ్యేది. ప్రభుత్వం నిషేధం విధించడంతో దిగుమతికి వ్యాపారులు జంకుతున్నారు. అయితే రహస్యంగా తెచ్చి విక్రయిస్తున్నారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తున్నారు. చైనా మాంజా విక్రయం లాభసాటిగా ఉండడంతోపాటు బలంగా ఉంటుందన్న అభిప్రాయంతో చిన్నారులు ఇష్టపడుతున్నారు. నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని, పక్షుల ప్రాణాలు కాపాడాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

పక్షులకు గాయాలు

పతంగులను ఎగురవేసే సమయంలో ఎదుటివారి గాలిపటాన్ని నేలకూల్చడానికి(కైంచీ) చైనా మాంజాను వినియోగిస్తున్నారు. ఈ మాంజా టాంగూస్ (ప్లాస్టిక్ దారం)కు గాజుపొడి అద్ది తయారు చేస్తారు. అయితే, ఈ మాంజాతో గాలిపటం ఎగురవేసే వారికి, పక్కనున్న వారి చేతులకూ గాయాలవుతున్నాయి. పతంగులు ఎగురవేస్తున్న సమయంలో చెట్లకు, విద్యుత్ స్తంభాలకు పతంగులతోపాటు చైనా మాంజా చిక్కుకోవడంతో మాంజాకు తగిలే పక్షులు, జంతువులు కూడా మృత్యువాత పడుతున్నాయి.

వ్యాపారులు గ్రహించాలి...

గాలిపటం కోసం చైనా మాంజా అమ్మితే వ్యాపారికి వచ్చే లాభం మహా అయితే రూ .20 ఉండొచ్చు. అక్రమంగా చైనా నుంచి మాంజా తెచ్చే వారికి లక్షల్లో మిగలవచ్చు. కానీ ఇక్కడ చివరిలో కస్టమర్‌కి అందిస్తున్న వారే ముఖ్యం. చైనా మాంజా ప్రమాదం అని తెలిసి కేవలం డిమాండ్ ఉందనే కారణంతో మిగిలే వేల రూపాయల కోసం దానిని అమ్ముతూ వస్తున్నారు. పక్షులు, మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నారు. ఈ విషయాన్ని వ్యాపారులు గుర్తించాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లాంటి నగరాల్లోనూ చైనా మాంజా తయారు చేస్తున్నారు. గుట్టుగా జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఈ మాంజా కారణంగా పక్షులు, జంతువులే కాదు..మనుషులూ గాయపడుతున్నారు. ఖానాపూర్ పట్టణానికి చెందిన ఇద్దరు చైనా మాంజాతో సోమవారం తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పరిమి చంద్ర విలాస్‌తోపాటు కడెం మండలం మాసాయిపేట్‌కు చెందిన ఎట్టం ఎర్రన్న విద్యానగర్ నుంచి బస్టాండ్‌కు వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై వచ్చే క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై మాంజా దారం అడ్డుగా వచ్చింది. దీంతో చంద్రవిలాస్ గొంతుకు మాంజా కోసుకుపోవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. అదే సమయంలో మాంజాను గమనించి ఎర్రన్న చేతితో మాంజాను అడ్డుకునే ప్రయత్నం చేయగా చేతి వేళ్లకు గాయమైంది.

చైనా మాంజాపై నిషేధం



పతంగులు ఎగురవేయడానికి ఎట్టి పరిస్థితిలో చైనా మాంజా వాడొద్దు. ప్రభుత్వాలు చైనా మాంజా వాడకాన్ని నిషేధించాయి. చైనా మాంజా వాడకం వల్ల కలిగే అనార్థాలపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలి. చైనా మాంజాతో పక్షులు, ఇండ్ల మీద తిరిగే కోతుల ప్రాణాలు పోతున్నాయి. మాంజా వాడకం వల్ల పక్షులకు, జంతువులకు హాని జరిగితే జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుంది. ఎవరైనా చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా జరిమానా విధిస్తాం.

– రామకృష్ణ, ఎఫ్ఆర్‌వో

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు..



సంక్రాంతి పండగ నేపథ్యంలో చైనా మాంజా విక్రయించే దుకాణాలపై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారు. చైనా మాంజాతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టిసారించాం. ఎవరైనా చైనా మాంజా నిల్వ చేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి. ఇప్పటికే జిల్లా పరిధిలో అన్నిచోట్ల తనిఖీలు ప్రారంభమయ్యాయి. మాంజా నిషేధాన్ని గట్టిగా అమలు చేయడంలో ప్రభుత్వానికి సహకారం అందించాలి. అప్పుడే సురక్షితమైన, ఆనందమైన సంక్రాంతిని జరుపుకోవచ్చు.

– జానకీషర్మిల, ఎస్పీ

న్యూస్‌రీల్

నర శతకం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

సోన్: నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని న్యూ వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొండూరు పోతన్న రచించిన నర శతకం పుస్తకాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిలతో కలిసి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నాలం విద్యసాగర్ మాట్లాడుతూ నిర్మల్ ఉత్సవాల్లో పుస్తకాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కొండూరి పోతున్నను వీడీసీ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రణాళికతో చదవాలి

- డీఐఈవో పరశురాం



విద్యార్థులతో మాట్లాడుతున్న పరశురాం

తానూరు: వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ప్రణాళికతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈవో పరశురాం సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. జనవరిలో పూర్తికావాల్సిన సిలబస్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు వందశాతం హాజరు కావాలన్నారు. 90 రోజుల ప్రణాళికలను అమలు చేయాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్‌కు సూచించారు. కళాశాలలో తగిన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు డీఐఈవో దృష్టికి తీసుకువెళ్లారు. నూతన కళాశాల భవనం నిర్మాణ పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఏఎస్పీకి వినతి



పోలీస్ కార్యాలయంలో గొల్లపేట్ కాలనీ వాసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ కాలనీలోని బీసీ శ్మశానవాటికను కొందరు కబ్జా చేస్తున్నారని కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ ఉపేంద్రారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా కాలనీలో శ్మశానవాటిక ఉందని, కొందరు అన్య మతస్థులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు.

నేడు భైంసాలో ఎస్పీ

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ జానకీషర్మిల బుధవారం అందుబాటులో ఉండనున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు నేరుగా కలిసి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాలో ప్రతిభ



గాయత్రి(నక్షత్ర)ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ విజయేంద్ర బోయి

కుభీర్: మహబూబ్‌నగర్ జడ్చర్లలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాలో కుభీర్ మండలం గొడ్సర గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని గాయత్రి(నక్షత్ర) ప్రతిభ కనబర్చిందని ఉపాధ్యాయులు తెలిపారు. గాయత్రి తయారు చేసిన ప్రాజెక్ట్ క్లాప్ బేస్డ్ ఆన్, ఆఫ్ సిస్టమ్‌ను ఇందులో ప్రదర్శించింది. దీనిని చూసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ విజయేంద్ర బోయి గాయత్రిని అభినందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దివ్యాంగులు, వృద్ధులు లైట్లు, టీవీలను కూర్చున్న చోటు నుంచి నియంత్రించవచ్చు. గాయత్రిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ఇందులో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.మురళీమనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వాహిద్‌ఖాన్, కోశాధికారి మేడారం శ్రీనివాస్, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, గంగాధర్, పోల ధర్మరాజ్, ధృపత్‌రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర' ఉద్యోగుల సమ్మె విరమణ



సమ్మె విరమణపత్రం ఇస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎట్టకేలకు సమ్మె విరమించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ఎదుట 29 రోజులు సమ్మె చేశారు. డిప్యూటీ సీఎంతో సోమవారం జరిపిన చర్చలు ఫలించడంతో మంగళవారం సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. సమ్మె విరమణ పత్రాన్ని డీఈవో రామారావుకు అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వం నెల రోజుల సమయం కోరినందున సమ్మె తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు.

- నిర్మల్ ఉత్సవాలకు భారీగా ప్రజలు
- మరోరోజు పొడిగించిన కలెక్టర్
- నేటి సాయంత్రం వరకు సంబురాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ చైర్మన్ తదితరులు

ఉత్సవం సంబురం

నిర్మల్: మూడురోజులుగా చారిత్రక, సాంస్కృతిక కళావైభవాన్ని చాటుతున్న నిర్మల్ ఉత్సవాలకు భారీగా స్పందన వస్తోంది. జిల్లా ప్రజల కోరిక మేరకు వేడుకలను మరోరోజు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రకటించారు. ఈ వేడుకలు బుధవారం రాత్రి వరకు ఉంటాయని, జిల్లావాసులందరూ ఇందులో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సంబురాల్లో భాగంగా మంగళవారం రోజంతా స్టాల్లు కొనసాగాయి. సాయంత్రం సాంస్కృతిక, చారిత్రక కార్యక్రమాలు అలరించాయి.

చరిత్ర చాటడం అభినందనీయం..

నిర్మల్ చరిత్రతోపాటు సంస్కృతిని ముందుతరాలకు అందించేలా కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ ఉత్సవాలను నిర్వహించడం ప్రశంసనీయమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆమెను శాలువాతో సన్మానించారు. ఉత్సవాల్లో మూడోరోజు నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. అంతకు ముందు అల్లోలకు కలెక్టర్ స్వాగతం పలికి జ్ఞాపికలతో సన్మానించారు. ఈసందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ నిర్మల్‌కు ఘనమైన చరిత్ర ఉందని, ఇక్కడి కట్టడాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా గతవైభవాన్ని చాటుతున్నాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా నిర్మల్ ఘనతను చాటడంతోపాటు చరిత్రను ముందుతరాలకు అందించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

ఉత్సవాలకు వస్తూనే ఉన్నారు..

మూడురోజులపాటే నిర్వహిస్తామని చెప్పిన ఉత్సవాలను మరోరోజు పొడిగించడానికి ప్రజాదరణ రోజురోజుకూ పెరగడమే కారణం. జిల్లా కేంద్రవాసులతోపాటు వివిధ మండలాలు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచీ చాలామంది వచ్చి తిలకిస్తున్నారు. మూడోరోజూ నిర్మల్ చరిత్రను అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళీ, ఉపాధ్యాయుడు దేవరావు వివరించారు. కళాకారులు, విద్యార్థినుల సాంస్కృతిక సంబురం అంబరాన్నంటింది. ఒకరినిమించి ఒకరన్నట్లుగా చేసిన నృత్యాలు అందరితో చప్పట్లు కొట్టించాయి. మూడోరోజూ ఫుడ్‌స్టాళ్ల వద్ద సందడి కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గణిత, సామాన్యశాస్త్రాల ఆధారంగా పెట్టిన ఆటలు చిన్నారులను ఆకట్టుకున్నాయి.



వేదికపై కళా ప్రదర్శన



నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

10న వెదురు వనం వేలం

నిర్మల్‌చైన్‌గేట్: ముధోల్ మండలం ముద్గల్ గ్రామంలో ప్రభుత్వ మోడల్ బాంబూ ఫారంలో జిల్లాలోని వెదురు తోట పంటను ఈనెల 10న ఉదయం 10 గంటలకు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖా అధికారి సమక్షంలో వేలం వేయనున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి బీవీ.రమణ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. బిడ్‌ను బహిరంగ వేలం ద్వారా తెలియపర్చాలని, బహిరంగ వేలంలో ఎక్కువ మొత్తం బిడ్ పెట్టిన వారికి మాత్రమే వేలం అనుమతించబడుతుందని వివరించారు. వేలంలో నెగ్గినవారు పాట మొత్తంలో సగం సొమ్మును నగదుగా వెంటనే చెల్లించాల న్నారు. చెల్లించకుంటే పాట రద్దు చేసి తర్వాతి వ్యక్తికి మొదటి వ్యక్తి పాడిన వేలం మొత్తానికి అనుమతిస్తామని వివరించారు. మొదటి వ్యక్తి డిపాజిట్ జప్తు అవుతుందని తెలిపారు. పూర్తి సొమ్మును ఈనెల 31 లోపు చెల్లించాలని పేర్కొన్నారు. మొత్తం సొమ్ము చెల్లించిన తర్వాతనే పంట కోసందుకు అనుమతి ఇస్తామని వెల్లడించారు. నగదు చెల్లించకుంటే వేలం రద్దు చేసే అధికారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారికి ఉందని తెలిపారు.

పత్తి ధర తగ్గింపు

సారంగపూర్: కొనుగోలు కేంద్రానికి వస్తున్న పత్తిలో నాణ్యత తగ్గడంతో సీసీఐ ధర తగ్గించింది. క్వింటాల్‌కు రూ.100 చొప్పున ధర తగ్గించిందని ఏఎంసీ కార్యదర్శి ధూమ్మా నాయక్ తెలిపారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 ఉండగా తగ్గించిన తర్వాత క్వింటాల్‌కు రూ.7,421 చెల్లిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఈవిషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీల శ్రమదోపిడీ ఆపాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు


నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల శ్రమదోపిడీని ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. ఆల్ ఇండియా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ ఆయా ఫెడరేషన్ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. యూనియన్ నిర్ణయం ప్రకారం ఇన్‌చార్జి సెంటర్లు నడపొద్దన్నారు. అంగన్‌వాడీలు ఏ కారణంగా అయినా చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు చెల్లించాలన్నారు. సెంటర్లకు టేబుల్, కుర్చీలు, మంచి నీరు, మరుగు దొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. మెస్ చార్జీలను పెంచి నాణ్యమైన వస్తువులను సరఫరా చేయాలని కోరారు. పదవీ విరమణ బెనిఫిట్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రతీనెల 1వ తేదీ న వేతనాలు, సమ్మె కాలపు జీతాలు చెల్లించాలన్నారు. సమ్మె కాలంలో అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యలక్ష్మి బిల్లులు, స్టేషనరీ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్యన్.రెడ్డి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు కె.రాణి, జిల్లా కోశాధికారి దయాసగారి అర్చన, జయంతిమాల, లావణ్య అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడి

- వ్యవసాయ శాస్త్రవేత్త మంజులత

లక్ష్మణచాంద: అన్నదాతలు తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించవచ్చని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజులత సూచించారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా యాసంగిలో మొక్కజొన్నలో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మొక్కజొన్నంటలో ఎక్కువగా కత్తెర తెగులు అవకాశం ఉందని, దీని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలన్నారు. పంట సాగు చేసే ముందు లోతు దుక్కులు దున్నాలని, అంతర పంటలుగా పప్పు ధాన్యాలు సాగు చేయాలని తెలిపారు. చేనులో అక్కడక్కడా లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. తెగులు సోకినప్పుడు క్రిమి సంహార మందును సుడులలో పిచికారీ చేయాలని పేర్కొన్నారు. నోమోరేలియా శిలీంద్రం వాడాలని సూచించారు. ఏఈవోలు పవిత్ర, సుష్మిత పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: పాఠశాలలకు అవసరమైన సమగ్ర శిక్ష మెటీరియల్‌ను డీఈవో రామారావు మంగళవారం ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. సమగ్ర శిక్ష నూతన విద్యా విధానంలో భాగంగా ఐఐటీ గాంధీనగర్ మంజూరు చేసిన ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్‌ను జిల్లాలోని 11 ఉన్నత పాఠశాలలు, 136 ప్రాథమిక పాఠశాలలకు అందజేశారు. ఇందులో విద్యార్థులకు ఉపయోగపడే 25 రకాల వస్తువులు ఉన్నాయి. వీటితో విద్యార్థులు ఆటలతో కూడిన విద్యను వినోదాత్మకంగా నేర్చుకునేవీలు కలుగుతుంది. ఉపాధ్యాయులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో పేర్కొన్నారు. ఇందులో ఎంఈవోలు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



కరపత్రాలతో ఆర్టీవో అధికారులు, టోల్ సిబ్బంది..

సోన్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద నిర్మల్ ఆర్టీవో దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్టు తప్పక ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంవీఐ మహేందర్, ఏఎంవీఐ ముర్తాజాఅలీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


తిరుపతి (ఫైల్)

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.గోపి తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్‌కు చెందిన మోరె తిరుపతి (49) సోమవారం మాదాపూర్ గ్రామ సమీపంలోని గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా సబ్ స్టేషన్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావణే రవి (37) మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన రవి పని నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై కోడద్ గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా మార్గమధ్యలో రాంపూర్ సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి మహిళ..

బజార్‌హత్నూర్(బోథ్): ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన మెకెన్ గౌరు బాయి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి దేగామ పోచమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆటోలో గిర్నూర్‌కు వస్తుండగా దేగామ సమీపంలో మూలమలుపు వద్ద డ్రైవర్ రాకేష్ వేగంగా నడపడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో లింగంపెల్లి అడెళ్ళ(35) మృతి చెందగా తోషం రాజుబాయి, మైలారపు అరుణ్, అయిల ఆశన్నకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మళ్లీ కలప దందా

- నాలుగేళ్లుగా అజ్ఞాతంలో స్మగ్లర్లు
- ఇటీవల అడవుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- దాడులతో సవాల్ విసురుతున్న వైనం


కలప స్మగ్లర్లు బ్రిడ్జిపై నుంచి తోసేసిన అటవీశాఖ అధికారుల వాహనం (ఫైల్)


ఇచ్చోడ మండలంలోని కేశవపట్నంలో నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, సిరికొండ కేంద్రాలుగా మళ్లీ కలప దందా షురువైంది. కొన్ని రోజులుగా స్మగ్లర్లు దట్టమైన అటవీప్రాంతంలోని టేకుచెట్లను నరికి రాత్రిపూట స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. వాటిని సైజులుగా మార్చి ద్విచక్ర వాహనాలపై గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

నాలుగేళ్లుగా అజ్ఞాతంలోకి..

జిల్లాలోని అటవీ ప్రాంతాలన్నీ కొన్నేళ్లుగా స్మగ్లర్ల గొడ్డలివేటుకు మైదానాలుగా మారిపోయాయి. దీంతో 2019–20 సంవత్సరంలో అప్పటి సీఎం చంద్రశేఖర్‌రావు కలప దందాను సీరియస్‌గా తీసుకున్నారు. 'జంగిల్ బచావో...జంగిల్ బడావో' అనే నినాదంతో అడవులను రక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు, అటవీశాఖ సంయుక్తంగా కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపారు. స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీయాక్టు కింద కేసు నమోదు చేశారు. దీంతో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్ పడింది. నాలుగేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న స్మగ్లర్లు ఇటీవల మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా దందాను షురూ చేశారు.

దాడులు కొత్తేమీ కాదు..

కలప అక్రమ దందా చేస్తున్న వారంతా నేర ప్రవృత్తి కలిగిన వారే. గతం నుంచీ కూడా వారికి అడ్డువచ్చిన అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేయడం వారికి కొత్తేమీ కాదు. గతంలో అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని సోన్, నిర్మల్, నిజామాబాద్, మహారాష్ట్రలోని పాంఢ్రకొడ, యవత్మాల్ పోలీస్ స్టేషన్లలో వేల కేసులు నమోదయ్యాయి.

అటవీశాఖ అధికారులపై దాడులు కొన్ని...

- 2012లో ఇచ్చోడ మండలంలోని చించోలిలో బ్రిడ్జి వద్ద ఆగిఉన్న అటవీశాఖ వాహనాన్ని కిందకు తోసివేశారు.
- 2014లో బజార్‌హత్నూర్ మండలంలోని డేద్రా అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు టేకు చెట్లను నరుకుతుండగా సిబ్బందితో కలిసి అడ్డుకునేందుకు వెళ్లిన ఇచ్చోడ అటవీశాఖ అధికారిపై రాళ్లతో దాడి చేయగా ఎఫ్ఆర్వో తలకు తీవ్రగాయాలతో బతికి బయటపడ్డాడు.
- 2016లో ఇచ్చోడ మండలంలోని మాన్కపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న చెక్‌పోస్టును ధ్వంసం చేశారు.
- 2023లో ఇంద్రవెల్లి నుంచి ఐచర్ వాహనంలో కలప తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు గుడిహత్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐచర్ వ్యానుతో అటవీశాఖ సిబ్బందిని ఢీ కొట్టే ప్రయత్నం చేయగా తప్పించుకున్నారు.
- 2024లో సిరికొండలో అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను పట్టుకోగా స్మగ్లర్లు అటవీశాఖ సిబ్బందిపై దాడిచేసి పరారయ్యారు.

ఇటీవల పట్టుబడిన కలప వివరాలు

- డిసెంబర్ 14న సిరికొండ నుంచి ఆదిలాబాద్ వైపు ఆటోలో తరలిస్తున్న రూ.60 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 17న సిరికొండ మండలంలోని బోరింగ్‌గూడలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 24న ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన రూ.30 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 30న ఇచ్చోడ మండలం హరినాయక్ తాండ వద్ద ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ.27 వేల విలువైన కలపను పట్టుకున్నారు.
- జనవరి 5న కేశవపట్నంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించి రూ.3.50 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కలప అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్మగ్లింగ్ నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఎఫ్‌వో, ఆదిలాబాద్

ఆదివాసీ గ్రామాల్లో కులదేవత ఉత్సవాలు


జంగుబాయి ఆలయానికి వెళ్తున్న గిరిజనులు


కానుకలు వేస్తున్న కొలాం ఆదివాసీలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నెలవంకకు మొక్కిన కొలాం ఆదివాసీలు వారం రోజుల పాటు తమ వంశీయులు ఉన్న గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెర్సపేన్(పెద్దదేవుడు), జంగుబాయి దేవతలున్న గ్రామాలకు వెళ్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పాటగూడ కొలాం ఆదివాసీలు (కుమ్ర వంశీయులు) జంగుబాయి దేవత ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సంప్రదాయ వాయిద్యాలతో పుణ్య(గంగా)స్నానం కోసం కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. బుధవారం రాత్రి గ్రామానికి చేరుకుని జంగుబాయికి మహా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి పూజారి కుమ్ర బాపురావ్, గ్రామ పెద్దలు కొడప లక్ష్మణ్, కుమ్ర రాజు, టేకం లేత, కుమ్ర రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వేమంత్రిని కలిసిన 'ఏలేటి'


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపట్టాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి కేంద్ర రైల్వే మంత్రిని ఢిల్లీలో మంగళవారం కలిశారు. రాష్ట్రంలో చేపడుతున్న నూతన రైల్వేలైన్ విస్తరణ పనులపై చర్చించారు. నిర్మల్ జిల్లా ప్రజల చిరకాల కోరికగా ఉన్న రైల్వేలైన్ నిర్మాణాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి, రైల్వేలైన్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు జిల్లా బీజేపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు

నిర్మల్‌రూరల్: ప్రధానోపాధ్యాయుడిపై దాడికి పాల్పడిన జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు నాకిడి బక్కన్న గత ఆగస్టులో అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి సంబంధించిన పెండింగ్ బిల్లుల గురించి జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అతని కుమారుడు నాకిడి ఆదిత్య మంగళవారం వెంగాపేట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గజ్జరం వద్దకు వెళ్లి ఆరా తీశాడు. ఆ సమయంలో కరెంటు లేకపోవడంతో బయట చేయించుకోమని హెచ్ఎం బదులిచ్చాడు. బయటకు వెళ్లిన ఆదిత్య తిరిగి మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి తన తండ్రికి సంబంధించిన పెండింగ్ బిల్లులు ఎందుకు చేయడం లేదని అతనితో గొడవపడి, కర్రతో గాయపరిచాడు. ప్రధానోపాధ్యాయుడు గజ్జరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదిత్యపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సొంతింటి కల నెరవేరే వరకూ పోరాటం


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సొంతింటి కల నెరవేరేంత వరకు పోరాడుతామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం ఎస్సార్పీ3 గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై ఏళ్ల సంస్థలో పనిచేసిన కార్మికులు కనీసం సొంతింటిని కూడా నిర్మించుకోలేక పోతున్నారన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కనీసం స్ట్రక్చరల్ సమావేశాల్లో వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గొల్ల బాలాజీ, కోశాధికారి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, ఆర్జీ 1 అధ్యక్షుడు రాజమౌళి, బ్రాంచ్ నాయకులు బోడకుంట శంకర్, చీకట్ల సాగర్, శ్రీపతి బానేష్, పెరిక సదానందం, మెల్లం శ్రీధర్, నరహరి, వెంకటరెడ్డి, మాదాసి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రిటైర్డు కార్మిక కుటుంబాలు

బెల్లంపల్లి: సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. కన్నాలబస్తీ, టేకులబస్తీ, ఇతర బస్తీలలో నివాసం ఉంటున్న రిటైర్డు కార్మికులు రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ పురోభివృద్ధి కోసం రక్త మాంసాలను ధారపోసిన రిటైర్డు కార్మికులపై సింగరేణి యాజమాన్యం సానుభూతి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. చాలీచాలని పింఛన్ డబ్బులతో జీవిత చరమాంకంలో ఎన్నోబాధలను అనుభవిస్తున్నామన్నారు. తమకు కంపెనీ క్వార్టర్ తప్ప మరో ఆధారం లేదన్నారు. ఈ విషయంలో కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు అమానుల్లాఖాన్, కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎండీ గౌస్, మాజీ ఎంపీపీ తొంగల మల్లేశ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పొట్ల సురేశ్, ఆకుల సత్యనారాయణ, రిటైర్డు కార్మికులు పాల్గొన్నారు.

కలప పట్టివేత


గుండాలలో పట్టుకున్న కలప

ఇచ్చోడ: మండలంలోని గుండాలలో మంగళవారం దాచి ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గుండాలలో తనిఖీలు నిర్వహించగా రంజా న్ అనే వ్యక్తి ఇంట్లో దాచి ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ రూ.6,400 ఉంటుందన్నారు.

జన్నారం: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న కలపను మాటు వేసి పట్టుకున్నట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. నాలుగు రోజులుగా కలప తరలించడానికి యత్నిస్తున్నారనే సమాచారం మేరకు రేంజ్ అధికారి సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సోమవారం రాత్రి ముచ్చినేని రాజు టేకు దుంగను బైక్‌కు కట్టుకుని వస్తుండగా పట్టుకున్నారు. బైక్‌తో పాటు కలప దుంగను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు లాకవత్ ఉపేందర్, లాకవత్ రాజు, గవ్వల మురళి, రాజుపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ. 29,134 ఉంటుందన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

భైంసాటౌన్: జాతీయ విద్యావిధానంపై ఢిల్లీలో జరిగే శిక్షణకు భైంసా పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ ఎంపికయ్యారు. లోకేశ్వరం మండలం మన్మద్ జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న నవీన్‌కుమార్ ఈనెల 8 నుంచి 28 వరకు జరిగే శిక్షణకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి పదిమందిని ఎంపిక చేయగా జిల్లా నుంచి నవీన్‌కుమార్ ఉన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా


సమ్మయ్యను అభినందిస్తున్న ఏసీపీలు

బెల్లంపల్లి: హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన తెలంగాణ స్టేట్ 11వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్య సత్తా చాటాడు. 50 సంవత్సరాల విభాగంలో జరిగిన హ్యామర్‌త్రో పోటీల్లో ప్రథమ బహుమతి, డిస్కస్‌త్రో పోటీల్లో తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. మంగళవారం రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అడ్మిన్ ఏసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ సుందరరావు, కమిషనరేట్ ఎంటీవో సంపత్‌కుమార్ అభినందించి రివార్డు అందజేశారు.

వన్యప్రాణుల వేటగాళ్ల పట్టివేత


వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడే ముఠాను మంగళవారం పట్టుకున్నట్లు లక్సెట్టిపేట అటవీరేంజ్ అధికారి అత్తె సుభాష్ తెలిపారు. టీకానపల్లికి చెందిన జాడి రాజలింగు, ఇరగడ్డ సాగర్, బుద్దిపల్లికి చెందిన జాడి వినోద్, దుర్గం ప్రశాంత్, దుర్గం రాములు జాడి రాజలింగుకు చెందిన పత్తి చేనులో ఉన్న విద్యుత్ లైన్ ద్వారా సమీప అటవీ ప్రాంతంలో సంచరించే వన్యప్రాణులను వేటాడేందుకు రెండు కిలోమీటర్ల వరకు బైండింగ్ వైర్ వేశారు. ఈ నెల 3న అటవీ అధికారులు గమనించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని లక్సెట్టిపేట అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. విచారణలో నేరం అంగీకరించడంతో వైల్డ్‌లైఫ్ సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కానీ మూడు రోజుల క్రితం వేటగాళ్లను అదుపులోకి తీసుకున్న అధికారులు బేరసారాలు సాగిస్తున్నారని ముమ్మర ప్రచారం జరగడంతో అప్రమత్తమై ఎట్టకేలకూ అరెస్టును అధికారికంగా ప్రకటించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చైనా మాంజా వినియోగిస్తే చర్యలు తప్పవు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్ నాయక్

కాసిపేట(బెల్లంపల్లి): చైనామాంజాతో గాలిపటాలు ఎగురవేస్తే చర్యలు తప్పవని అటవీశాఖ డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్, ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేయడం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఇది ప్లాస్టిక్ పదార్థంతో చేయడంతో గట్టిగా పదునుగా ఉంటుందని, ఆ దారానికి గాజుపొడి పూయడంతో పిల్లలు, మనుషులు, పక్షులు, అటవీ జంతువులను కోసుకుపోవడం వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర పర్యవరణ చట్టం 2016 ఉత్తర్వుల ప్రకారం చైనా మాంజాను నిషేధించినట్లు తెలిపారు. మాంజాను రవాణా చేసినా నిల్వ ఉంచినా గాలిపటాలు ఎగురవేసినా మూడు నుంచి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో శ్రీధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నాగమల్లయ్య, పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, తిరుపతి, చెంద్రశేఖర్‌రెడ్డి, మాధవిలత, కృష్ణగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ గద్దె రాజు

రామకష్టాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి తెలంగాణ స్థాయి(సౌత్‌జోన్)అండర్–13 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఖేలో ఇండియా పోటీలలో భాగంగా ఐదు రోజులపాటు లీగ్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొత్తం ఏడు జిల్లాల జట్లు పాల్గొననున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పోటీల నిర్వహణకు సింగరేణి యాజమాన్యంతో పాటు క్యాతనపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఏఈ అచ్యుత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు పరిశీలించారు.

కరంజీలో పులి సంచారం


పులి జాడ కోసం గాలిస్తున్న అధికారులు


అధికారులు గుర్తించిన పులి పాదముద్ర

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు
- మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు
- పరిసర గ్రామాల్లో భయాందోళన

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని కరంజి(కే)గ్రామంలో పులి సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. పంట చేలకు వెళ్లిన రైతులు పులి పాదముద్రలు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అధికారులు ఆ గ్రామానికి చేరుకుని పాదముద్రలను గుర్తించి పులి కదలికలను నిర్ధారించారు. మహారాష్ట్రలోని పాంఢ్రకవడ డివిజన్ జామిని రేంజ్ నుంచి పెన్‌గంగ దాటి బేల రేంజ్‌లోకి వచ్చిందని, కరంజీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో పోలీసులు, గ్రామస్తులు, అటవీ శాఖ అధికారులు పులి జాడ కోసం అన్వేశించారు. పులిని గుర్తించేందుకు ఒక్కో బృందంలో ఐదుగురు చొప్పున మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి గులాబ్‌సింగ్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. తప్పుడు పుకార్లు నమ్మవద్దని పాదముద్రలు గానీ, పులి కదలికలు కానీ గమనించినట్లైతే వెంటనే అటవీ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సూర్యాస్తమయం తర్వాత పంటచేలో ఉండవద్దని, ఒంటరిగా చేలకు వెళ్లవద్దని సూచించారు. పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు చప్పుడు చేసుకుంటూ గుంపులుగా వెళ్లాలన్నారు. జైనథ్ సీఐ సాయినాథ్‌తో పాటు ఏఎస్ఐ ఆత్మారాం, అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు నాగోరావు, రాజేందర్, ఆర్.గులాబ్‌సింగ్, మనోరంజనీ, ప్రవీణ్, సంతోష్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్న వాహనం ఇచ్చేశారు..

మందమర్రిరూరల్: నాలుగు రోజుల క్రితం సింగరేణి స్క్రాప్ చోరీ చేసి సెక్యూరిటీ సిబ్బంది వెంబడించడంతో దొంగలు స్కూటీని వదిలి వెళ్లారు. స్కూటీని, స్క్రాప్‌ను స్వా ధీనం చేసుకుని ఏరియాలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయానికి తరలించారు. ఏం జరిగిందో తెలియదు కానీ మూడు రోజుల తర్వాత స్కూ టీని సంబంధిత వ్యక్తికి ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయమై ఏఎస్‌వోను వివరణ కోరగా చోరీకి వచ్చిన వ్యక్తి మరొకరి స్కూటీని తెచ్చాడని, స్కూటీకి సంబంధించిన వ్యక్తి కార్యాలయానికి వచ్చి కోరగా ఉన్నతాధికారులకు విషయం చెప్పి స్కూటీని ఇచ్చేశామన్నారు.

పురుగుల మందుతాగి ఒకరు బలవన్మరణం

బెజ్జూర్: పురుగుల మందు తాగి ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అందుగులగూడకు చెందిన కోరేత ప్రకాశ్ (32)కు గబ్బాయి గ్రామానికి చెందిన లలితతో పదమూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి గబ్బాయిలోనే నివాసం ఉంటున్నాడు. దంపతులకు తొమ్మిదేళ్ల కూతురు ఉంది. భార్య ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంటివద్ద పెరట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా 108లో బెజ్జూర్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా ప్రకాశ్ మృతికి అతని భార్య కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చి ఫిర్యాదు మేరకు లలితపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ల్యాండ్రీ షాపు దగ్ధం

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో గల దస్నాపూర్ కాలనీలో ల్యాండ్రీ షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు సాంటెన్న తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10.30 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లగా అప్పటికే అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారన్నారు. ప్రమాదంలో షాపులో ఉన్న ఫ్యాన్, టేబుల్, కుర్చీలు, బట్టలు దగ్ధమయ్యాయని, వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని సామాజిక వేత్త ముదుపు మౌనిష్ రెడ్డి కోరారు.